క్లుప్తంగా

తైక్వాండోలో అక్క, తమ్ముడికి గోల్డ్ మెడల్స్



మెడల్‌తో సాన్విశ్రీ, నరేన్‌కార్తీకేయ

దండేపల్లి: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన అక్క, తమ్ముడు దమ్మ సాన్విశ్రీ, నరేన్‌కార్తీకేయ తైక్వాండోలో బంగారు పథకాలు సాధించారు. సికింద్రాబాద్ కేంద్రీయ విద్యాలయంలో నవీన్ కార్తీకేయ 6వ తరగతి, సాన్విశ్రీ పదోతరగతి చదువుతోంది. ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో అక్కా, తమ్ముడు ఇద్దరు ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్స్ సాధించినట్లు తండ్రి సృజన్ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

వేమనపల్లి: ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ముల్కలపేటకు చెందిన మాజీ జెడ్పీటీసీ తుమిడె లచ్చయ్య కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పరామర్శించారు. ఆయనకు నూతన వస్త్రాలు, రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. డబుల్‌బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయిస్తానని, అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేణుమాదవ్ ఉన్నారు.

13నుంచి 'అప్లికేషన్ భరో'

జన్నారం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకం అందరికీ వర్తింపజేయాలనే ఉద్దేశంతో 'దళితబంధు దళితుల హక్కు' నినాదంతో 'అప్లికేషన్ భరో' కార్యక్రమం చేపట్టనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ రిసర్చ్ డిపార్టుమెంట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ వినోద్ నాయక్ ఆదివారం తెలిపారు. ఈ నెల 13 నుంచి ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం మండలంలో కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అర్హులైన దళితులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో పాటు దళితబంధు ఫారం నింపి తహసీల్దార్ కార్యాలయంలో అందజేయనున్నట్లు తెలిపారు. దళితబంధుకు దరఖాస్తు పెట్టాలనుకునే వారు 13న ధ్రువీకరణ పత్రాలతో తహసీల్దార్ కార్యాలయానికి హాజరుకావాలని కోరారు. మధ్యవర్తులు, అధికార పార్టీ నాయకులు దళితబంధు పథకంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చిన దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ధర్మసమాజ్ పార్టీ ధర్నా జయప్రదం చేయండి

జైపూర్: హైదరాబాద్‌లో సోమవారం ఇందిరాపార్క్ వద్ద ధర్మసమాజ్ పార్టీ నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని బీఎస్‌పీ మండల అధ్యక్షుడు జలంపల్లి వెంకటేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.40
పచ్చిమిర్చి	70
వంకాయ	40
కాకరకాయ	70
బెండకాయ	40
అలసంద	40
దొండకాయ	70
సొరకాయ	30
ఆకుగోబి	50
పూగోబి	60
క్యారెట్	60
క్యాప్సికం	90
పాలకూర	40
తోటకూర	40
ములక్కాయ	90

- మంచిర్యాలఅగ్రికల్చర్





ఎన్నాళ్లీ అవస్థలు..!

- ఎన్నికల హామీగానే ఎలకేశ్వరం రోడ్డు
- ఏటా ప్రజాప్రతినిధుల వాగ్దానాలు
- తాత్కాలిక రోడ్డుపై ప్రజల రాకపోకలు
- వర్షాకాలంలో బురదమయం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

భీమారం: మండలంలోని ఎలకేశ్వరం రోడ్డు ఎన్నికల హామీగానే మిగిలిపోతోంది. ప్రతిసారి ఎన్నికల్లో ప్రజాప్రతినిధులు రోడ్డు నిర్మిస్తామని హామీ ఇస్తున్నా, నేటికీ కార్యరూపం దాల్చడం లేదు. దీంతో గ్రామస్తులు రోడ్డు లేక తాత్కాలిక రోడ్డుపై నుంచే రాకపోకలు కొనసాగిస్తున్నారు. మంచిర్యాల-చెన్నూరు జాతీయరహదారికి దాదాపు 10కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎలకేశ్వరం గ్రామానికి రోడ్డు ఎందుకు నిర్మించడం లేదో నేటికి అర్థం కావడం లేదు. భీమారం-ఆరెపల్లి ప్రధాన రహదారి నుంచి 5కిలోమీటర్ల రోడ్డు నిర్మిస్తే రవాణా సదుపాయం పెరిగి, గ్రామం అభివృద్ధి చెందుతుందని గ్రామస్తులు అంటున్నారు.

వర్షాకాలం నానా ఇబ్బందులు..

వేసవికాలం మట్టి రోడ్డు నుంచి రాకపోకలకు ఇబ్బంది లేకపోయినా, వర్షాకాలం మాత్రం అవస్థలు పడుతున్నారు. రోడ్డంతా బురదగా మారి కాలు తీసి కాలు వేయలేని పరిస్థితి ఏర్పడుతోంది.

ఇద్దరు ప్రభుత్వవిప్‌ల హామీలు అంతే?

గతంలో చెన్నూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన నల్లాల ఓదెలు ఎన్నికల సమయంలో బీటీ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విప్ హోదాలో అనేక సార్లు రోడ్డు గురించి ప్రస్తావించాడు. కానీ అతడి పదవీకాలం ముగిసినప్పటికీ కనీసం ఒక తట్ట మట్టి కూడా వేయలేదు. తిరిగి 2018ఎన్నికల్లో బాల్కసుమన్ ఎన్నికల ప్రచారంలో ఎలకేశ్వరం వచ్చి అదే రోడ్డు గురించి హామీ ఇచ్చారు. కానీ నాలుగేళ్లు గడుస్తున్నా రోడ్డుకు మోక్షం కలుగడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలి



గ్రామానికి రోడ్డు కావాలని ఏళ్లుగా ప్రజాప్రతినిధులను కలిసి కోరుతున్నాం, అయినా మా కష్టాలు తీరడం లేదు. ప్రతి సారి ఎన్నికల్లో ఇది చేస్తాం, అది చేస్తాం అని చెప్పే ప్రజాప్రతినిధులు మాటలకే పరిమితమవుతున్నారు. అత్యవసర సమయాల్లో రోగులను పట్టణానికి తీసుకెళ్లాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోంది. వర్షాకాలంలో వాగేమో దాటనీయదు. రోడ్డంతా బురదగా మారి నడవలేని పరిస్థితి ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలి.

- శ్యాంసుందర్ రెడ్డి, ఎలకేశ్వరం

త్వరలోనే నిధులు మంజూరవుతాయ్..



ఎలకేశ్వరం గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వవిప్ బాల్క సుమన్ ఇప్పటికే ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి పంపారు. త్వరలోనే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరవుతాయి. ప్రజల చిరకాల కోరిక తీరుతుంది.

- బుక్యా తిరుమల, జెడ్పీటీసీ

దాటనీయని వాగు ప్రవాహం



ఎలక్వేరం-ఆరెపల్లి క్రాస్ రోడ్డు మధ్యలో గల వాగు ప్రవాహం వర్షాకాలంలో అధికంగా ఉంటుంది. దీంతో రోజుల తరబడి ఈ రహదారిలో రాకపోకలు నిలిచిపోతాయి. వాగులో కనీసం వంతెన నిర్మించాలని గత కొన్నేళ్లుగా ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లినా, అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

ప్రజాగర్జనకు తరలిన సీపీఐ శ్రేణులు



బెల్లంపల్లి: నినాదాలు చేస్తున్న కామ్రేడ్స్



మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో...

తాండూర్/బెల్లంపల్లి: కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజాగర్జన సభకు సీపీఐ ప్రత్యేకంగా రైలు సౌకర్యాన్ని కల్పించగా ఆదివారం బెల్లంపల్లి నుంచి సీపీఐ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసే లక్ష్యంలో భాగంగా ప్రజాగర్జన సభను కొత్తగూడెంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజా పోరాటాలతో సీపీఐ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సింగరేణి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సీతారామయ్య, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పూర్ణిమ, చిప్ప నర్సయ్య, అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, నాయకులు రాజేశం, శ్రీధర్, సంతోష్, లక్ష్మీనారాయణ, పురుషోత్తం, రాజమొగిలి, జీసీ మాణిక్యం, ఉపేందర్, ఎల్తూరి శంకర్, మేకల రాజేశం, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: ప్రజాగర్జన సభకు శ్రీరాంపూర్ నుంచి ఏఐటీయూసీ నాయకులు మంచిర్యాల రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక రైల్‌లో సభకు తరలివెళ్లారు. ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి వీ సీతారామయ్య ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ నుంచి డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు ఎస్కే బాజీసైదా, కే.వీరబద్రయ్య, కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచీ సెక్రెటరీలు కొట్టె కిషన్‌రావు, ఎం కొమురయ్య, నాయకులు సుమారు 200మంది శ్రీరాంపూర్ నుంచి తరలివెళ్లారు.

పాతమంచిర్యాల: ప్రజాగర్జన సభకు మంచిర్యాల నుంచి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ ఆధ్వర్యంలో మంచిర్యాల పరిసర ప్రాంతాల్లోని కార్మిక క్షేత్రాల నుంచి దాదాపు 3వేల మంది కార్యకర్తలు, నాయకులు మంచిర్యాల రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక రైలులో ఖమ్మంకు తరలివెళ్లారు.

నిధులు రావు.. పనులు సాగవు



అసంపూర్తిగా ఐకేపీ కమ్యూనిటీ భవనం



అసంపూర్తిగా పశువైద్యశాల

దండేపల్లి: మండల కేంద్రంలో ఐకేపీ కమ్యూనిటీ హాల్, పశువైద్యకేంద్రాలకు నూతన భవన నిర్మాణాలకు నిధులు రాక పనులు ముందుకు సాగడం లేదు. సుమారు ఆరేళ్ల క్రితం ఐకేపీ భవనానికి రూ.32లక్షలు, పశువైద్య కేంద్రానికి రూ13లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్లు వాటిని ఓపెన్ స్లాబ్ వరకు పనులు పూర్తిచేశారు. మిగితా పనులు చేపట్టేందుకు నిధుల కొరత ఏర్పడటంతో పనులను మధ్యలోనే నిలిపివేశారు. ఏళ్లు గడుస్తున్నా వాటిని పూర్తి చేయించడంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టిసారించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి వాటి నిర్మాణాలు పూర్తి చేయించాలని పలువురు కోరుతున్నారు.

యువత రక్తదానం



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దాదాపు 30మంది యువకులు, స్థానికులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్, నాయకులు సామల బుచ్చయ్య, వోలపు రమేశ్, సోగాల కిష్టయ్య, బేతు రవి పాల్గొన్నారు.

సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

భీమారం: మండల కేంద్రంలోని ఎస్సీ సమీకృత బాలుర వసతి గృహంలో చేరుటకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వసతీగృహం సంక్షేమాధికారి శ్రీసాయి లచ్చన్న ఆదివారం కోరారు. ఈ వసతి గృహంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు చేర్చుకుంటామన్నారు. వసతిగృహంలో అర్హత పొందిన వారికి నోట్‌పుస్తకాలతో పాటు అన్ని వస్తువులు ఉచితంగా అందిస్తామని తెలిపారు. హాస్టల్లో చేరే ఆసక్తి గల వారు ఆధార్‌కార్డు, బోనోఫైడ్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో వసతీగృహంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు 2కే రన్

మంచిర్యాలక్రైం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 12న ఉదయం 6గంటలకు మంచిర్యాల పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించనున్నట్లు స్థానిక సీఐ రాజు తెలిపారు. ఐబీ చౌరస్తా నుంచి ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానం వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువతీ, యువకులు స్వచ్ఛంద సంస్థలు, 2కే రన్‌లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చెన్నూర్/జైపూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని జైపూర్ సబ్ డివిజన్ పోలీసులు ఈ నెల 12న 2కే రన్ నిర్వహించనున్నట్లు జైపూర్ ఏసీపీ జి.నరేందర్, చెన్నూర్ సీఐ వాసుదేవరావ్ తెలిపారు. ఉదయం 6గంటలకు చెన్నూర్ జలాల్ పెట్రోల్ బంక్ నుంచి ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. చెన్నూర్, కోటపల్లి, నీల్వాయి, భీమారం, జైపూర్, శ్రీరాంపూర్, పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పోలీసులు, యువతీ యువకులు, అధికారులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి ప్రతిష్ఠాపన మహోత్సవం

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి, శివపంచాయతన, ఆంజనేయ, నవగ్రహ, ఆలయ ధ్వజశిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

పట్టణ అధ్యక్షుడిగా రాజశేఖర్

మందమర్రిరూరల్: బీసీ యువజన సంఘం మందమర్రి పట్టణ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మూడారపు రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి నరేందర్ ఆదివారం రాజశేఖర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం



జన్నాపూర్‌లో క్షీరాభిషేకం

భీమిని/మందమర్రిరూరల్: సీఎం కేసీఆర్ దివ్యాంగులకు రూ.వెయ్యి పెంచుతూ ప్రకటన చేయడంపై చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద, కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్‌లో దివ్యాంగులు ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మెడపట్ల సతీష్, నాయకులు రమణి, అక్బర్ హుస్సేన్, రెడ్డి రమేష్, శ్రీదేవి, స్వామి, రాజపోషం పాల్గొనగా, కన్నెపల్లిలో మాజీ జెడ్పీటీసీ అల్లి మోహన్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు జలపతి, మల్లేష్, కాల్ల సురేష్, మండల యువజన సంఘం అధ్యక్షుడు అల్లి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి: మండలంలోని మల్లంపేట గ్రామంలో దివ్యాంగుల పెన్షన్ రూ.4016కు పెంచినందుకు సర్పంచ్ అక్కల మధుకర్ ఆధ్వర్యంలో దివ్యాంగులతో గ్రామస్తులు కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాజేందర్, మహేందర్, సంపత్, రమేశ్, రామయ్య, రాజన్న, చంద్రయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.



మందమర్రిలో క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు



మల్లంపేటలో...

ముగిసిన శిక్షణ తరగతులు



వనితావాక్కు సభ్యులతో బాలికలు, చిన్నారులు

మంచిర్యాలటౌన్: వనితావాక్కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'మార్పు దిశగా మరో అడుగు' అనే నినాదంతో ఈ వేసవిలో బాలికలు, మహిళలకు ఉచిత శిక్షణ కార్యక్రమాలను నిర్వహించగా ఆదివారంతో ముగిశాయి. ఆడపిల్లలను శారీరకంగా, దృఢంగా తయారు చేసేందుకు గాను యోగా, మెడిటేషన్, కరాటే, మానసిక వికాస తరగతులు, సిలంబం అసోసియేషన్ వారి సహకారంతో కర్రసాము వేసవి శిక్షణ శిబిరాలను 50రోజుల పాటు, జిల్లా కేంద్రంలోని సెవెన్‌హిల్స్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించారు. వేసవి శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రశంస పత్రాలు, మెడల్స్‌తో పాటు, పిల్లలకు పర్యావరణ పరిరక్షణ మీద అవగాహన కల్పించి, మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెవెన్‌హిల్స్ వ్యవస్థాపకులు గోనె భాగ్యలక్ష్మి, కనపర్తి రమేశ్, సునిత కుర్మ, కవిత, మంజుల, తిరుమల, భవాని, సుజాత, సునిత, పూనం, మాధురి, అనిత, దేవిక వనితా వాక్కు సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు గంగజలాలతో అభిషేకం



జలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

కోటపల్లి: మండలంలోని నక్కలపల్లిలో కొలువుదీరిన మారెమ్మ సదల్వమ్మ జాతరకు సర్పంచ్ తోట స్రవంతి ముమ్మర ఏర్పాట్లు చేశారు. నేటి నుంచి ప్రారంభం కానున్న జాతరకు నిర్వాహకులు మొదటి రోజు అమ్మవార్లకు గంగజలాలతో అభిషేకం నిర్వహించి కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. నక్కలపల్లి గ్రామం నుంచి పాదయాత్రతో రాచర్ల వెంచపల్లి ప్రాణహిత నదిలో అమ్మవార్లకు గంగజలంతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలతో అమ్మవార్లను తీసుకొచ్చి ఆలయంలో ప్రతిష్టిస్తారు. ఈ కార్యక్రమంతో మారెమ్మ జాతరకు బీజం పడుతుంది. మొదటి రోజు అమ్మవారికి బోనాల సమర్పణ, మొక్కు చెల్లింపు, మంగళవారం అమ్మవారి విగ్రహాలతో రథయాత్ర ఉంటుందని సర్పంచ్ తోట స్రవంతి, ఆలయ పూజరులు తెలిపారు. మండలంలో ప్రతి వర్షాకాలం ప్రారంభంలో మొదలయ్యే ఈ జాతరకు నక్కలపల్లి గ్రామస్తులే కాకుండా, మండలంలోని వివిధ గ్రామాల భక్తులతో పాటు చెన్నూర్, మంచిర్యాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కు చెల్లించుకుంటారు.

'కలెక్టరేట్‌ను హాస్టల్‌కి కేటాయించాలి'

శ్రీరాంపూర్: కొత్త కలెక్టరేట్ కార్యాలయంలోకి వెళ్తున్న దృష్ట్యా పాత కలెక్టరేట్ భవనాన్ని తిరిగి ఎస్సీ హాస్టల్‌కు కేటాయించాలని ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ నియోజకవర్గం కో ఆర్డినేటర్ నయింపాషా, నాయకులు సంతోశ్, రాజు, శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2014లో ఎస్సీ హాస్టల్ కోసం దీన్ని శంకుస్థాపన చేసిన తర్వాత, 2016లో జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇప్పుడు కొత్త కలెక్టరేట్ భవనం ఏర్పాటు అయిన దృష్ట్యా దీన్ని తిరిగి ఎస్సీ హాస్టల్‌కు కేటాయించకుండా, జిల్లా కోర్టులకు కోసం కేటాయిస్తున్నారన్నారు. ఫలితంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఈ నిర్ణయం తీసుకోవడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, కలెక్టర్‌పై మానవ హక్కుల కమిషన్, బాలల హక్కుల కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సైడ్‌బర్మ్ పోయరూ..! | అటెన్షన్ ప్లీజ్..



భీమారం: మండల కేంద్రంలోని హనుమాన్‌దేవాలయం నుంచి బోయగూడెం వరకు నిర్మించిన సీసీ రోడ్డుకు ఇరువైపులా సైడ్‌బర్మ్ పోయకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి, రోడ్డుకిరువైపులా మట్టి పోయించాలని స్థానికులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: సతీష్‌రెడ్డి, ఎంపీవో   ఫోన్ నంబర్ : 98483 84636

'సొంత పార్టీలో అవమానం జరిగిందంటూ ఆవేదన'



మాట్లాడుతున్న నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులుగా వ్యవహరిస్తున్న తమకు సొంత పార్టీలోనే అవమానాలకు గురి చేస్తున్నారని పేర్కొంటూ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, ఆయన తనయుడు విజిత్‌రావుపై జెడ్పీటీసీ దంపతులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిర్యాల ఐబీ విశ్రాంతి భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్పీటీసీ పూస్కూరు శిల్ప, రైతుబంధు సమితి మండల కన్వీనర్ పూస్కూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మంచిర్యాల మెడికల్ కళాశాల హాజీపూర్ మండలం గుడిపేటకు మంజూరు కావడంలో తమపాత్రపై కక్షగట్టిన ఎమ్మెల్యే దివాకర్‌రావు ఇటీవల పార్టీ కార్యక్రమాలకు, అభివృద్ధి పనుల్లోనూ తమ భాగస్వామ్యం లేకుండా చూస్తున్నారన్నారు. ఈ నెల 9వ తేదీన మంచిర్యాలకు విచ్చేసిన సీఎం కేసీఆర్ ప్రగతినివేదన సభకు కూడా సభావేదికపైకి ఆహ్వానం కాదు కదా, సభావేదికపై కూర్చునేందుకు ఎమ్మెల్యే అందజేసిన ఆహ్వానపత్రంలో జెడ్పీటీసీ, రైతుబంధు సమితి మండల కన్వీనర్ల పేర్లు లేకపోవడంతో ఖంగు తిన్నామన్నారు. అయితే పార్టీలో ఎలాంటి హోదా లేని ఎమ్మెల్యే తనయుడు విజిత్‌రావుకు ఆహ్వాన పత్రికలో రెండో పేరు ఉండటం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. ప్రోటోకాల్ ప్రకారం సభావేదిక పైకి వెళ్లే క్రమంలో పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర అవమానం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. విజిత్‌రావు సీఎం సభలో ఏ హోదాతో సభావేదికపై కూర్చున్నాడని ప్రశ్నించారు. ఎమ్మెల్యే, తన తనయుడు విజిత్‌రావులపై బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, టీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌లతో పాటు సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే, ఆయన కుమారుడి అరాచకాలు, ఏకపక్ష ధోరణిపై ఫిర్యాదుతో కూడిన నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు రాచకొండ వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ గోనె సంజయ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ బొడ్డు శంకర్, నాయకుడు నల్ల వెంకటేశ్ పాల్గొన్నారు.